క్లుప్తంగా

దాతలు సహకరించాలి

నెహ్రూ నగర్: వరద బాధితులను ఆదుకునేందుకు దాతలు ముందుకు రావాలని, దాతల నుంచి నగదు, వస్తువుల సేకరణకు గుంటూరు నగరపాలక సంస్థ ప్రత్యేక సెల్ ఏర్పాటు చేసినట్లు కమిషనర్ పులి శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ హిందూ కాలేజ్ సెంటర్ లోని నగరపాలక సంస్థ ట్రావెలర్స్ బంగ్లాలోని 5వ నెంబర్ గదిలో సీనియర్ అధికారుల ఆధ్వర్యంలో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. వివరాలకు నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ 98499 08396ని సంప్రదించవచ్చని తెలిపారు.

కృష్ణవేణికి డాక్టరేట్ ప్రదానం



ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ హిందీ విభాగ పరిశోధకురాలు జె.కృష్ణవేణికి యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసిందని రీసెర్చ్‌సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ పి.సుధాకర్ తెలిపారు. హిందీ విభాగ పరిశోధనా పర్యవేక్షకులు డాక్టర్ కె.శ్రీకృష్ణ పర్యవేక్షణలో 'మెహరున్నీసా పర్వేజ్‌కి కహానియోమ్ మే నారీ కొ వివిధ్ రూప్' అనే అంశంపై పరిశోధనా గ్రంథం సమర్పించినందుకుగాను యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసిందన్నారు.

డివిజన్‌లో 26 మంది ఉపాధ్యాయుల సర్దుబాటు

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు డివిజన్ పరిధిలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న 26 మంది ఉపాధ్యాయులను వేర్వేరు పాఠశాలల్లో సర్దుబాటు చేశారు. పని సర్దుబాటు ప్రక్రియలో భాగంగా విద్యాశాఖ విడుదల చేసిన షెడ్యూల్ మేరకు మంగళవారం గుంటూరు డివిజన్ పరిధిలోని స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీలకు డీఈవో కార్యాలయంలో నిర్వహించిన కౌన్సెలింగ్ ద్వారా ఉత్తర్వులు జారీ చేశారు. సంబంధిత ఉపాధ్యాయులను వేర్వేరు పాఠశాలలకు పని సర్దుబాటుపై పంపుతూ, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ కార్యాలయం నుంచి ఆన్‌లైన్‌లో ఉంచిన ఉత్తర్వులను డీవైఈవో పి.వెంకటేశ్వరరావు ఉపాధ్యాయులకు అందజేశారు. డివిజన్ స్థాయిలో పని సర్దుబాటు పూర్తైనట్లు ఆయన తెలిపారు. కౌన్సెలింగ్ ప్రక్రియలో డీసీఈబీ కార్యదర్శి ఏ తిరుమలేష, ఉర్దూ డీఐ షేక్ ఎండీ ఖాసిం, డీఈఓ కార్యాలయ సిబ్బంది నాగమల్లేశ్వరరావు, శివనాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఐదుగురు ఎస్‌ఐలు బదిలీ

నగరంపాలెం: జిల్లాలో ఐదుగురు ఎస్‌ఐలను బదిలీ చేస్తూ జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. లాలా పేట ఎస్‌ఐ ఎం.సుబ్బారావు, నల్లపాడు ఎస్‌ఐ డి.ప్రవీణ్‌ను తాడేపల్లి ట్రాఫిక్ పీఎస్‌కు, పాతగుంటూరు పీఎస్ ఎస్‌ఐ పి.భాగ్యరాజ్‌ను తాడేపల్లి పీఎస్‌కు, గుంటూరు వీఆర్‌లో ఉన్న ఎస్‌ఐలు కె.శ్రీనివాసరావును లాలాపేట పీఎస్‌కు, పి.వెంకటేశ్వర్లను పాతగుంటూరు పీఎస్‌కు బదిలీ చేశారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



నగరంపాలెం: గుర్తుతెలియని ఓ వ్యక్తి మృతదేహాన్ని గుంటూరు రైల్వే స్టేషన్ తూర్పు వైపు నున్న ఆవరణలో మంగళవారం రైల్వే హౌస్ కీపింగ్ సిబ్బంది గుర్తించారు. ఈ మేరకు కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతుని చిరునామాపై స్థానికులను వాకబు చేశారు. మృతునికి సుమారు 40 ఏళ్ల వయసు, ఒంటిపై గీతలున్న చొక్కా, బ్లూ రంగు గళ్ల లుంగీ ఉన్నట్లు కొత్తపేట పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని గుంటూరు జీజీహెచ్‌లోని శవాగారంలో భద్రపరిచారు. సోమవారం రాత్రి మృతిచెందినట్లు పోలీసులు భావిస్తున్నారు. మృతుడి ఆనవాళ్లను ఎవరైనా గుర్తిస్తే 0863-2221815, 86888 31320, 93462 62557 నంబర్లల్లో సంప్రదించాలని పోలీసులు తెలిపారు.

ఫొటో స్టూడియోలో చోరీ

నగరంపాలెం: ఫొటో స్టూడియోలో చోరీపై మంగళవారం అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. గుంటూరు రూరల్ పరిధిలోని జొన్నలగడ్డ గ్రామానికి చెందిన నీరుకొండ రామారావు ఫొటో గ్రాఫర్. అతను అరండల్‌పేట 8/2వ అడ్డరోడ్డులోని ఏవీ స్టూడియో నిర్వహిస్తున్నారు. మంగళవారం ఉదయం స్టూడియో తాళం పగులకొట్టి ఉండడాన్ని తెలిసిన వారు గుర్తించి రామారావుకు సమాచారం ఇచ్చారు. దీంతో ఆయన స్టూడియో వద్దకు వచ్చి పరిశీలించారు. సుమారు రూ.4 లక్షలు ఖరీదు చేసే 5డీ కెమెరా కిట్, హార్డ్ డిస్కులు కనిపించలేదు. దీంతో ఆయన అరండల్‌పేట పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు, క్లూస్‌టీం ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేపట్టారు.

శివారు ప్రాంతాల అభివృద్ధికి చర్యలు

కమిషనర్ పులి శ్రీనివాసులు



అధికారులకు తగు ఆదేశాలు జారీ చేస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూ నగర్: గుంటూరు నగర శివారు ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని, ప్రధానంగా విలీన గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం స్థానిక బుడంపాడులోని రిజర్వాయర్‌ని పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ బుడంపాడు చెరువు వైపు నివాసాలకు వెళ్లే రోడ్ వర్షాలకు దెబ్బతిని రాకపోకలకు ఇబ్బందిగా ఉందన్న స్థానికుల అభ్యర్థన మేరకు తక్షణం ప్యాచ్ వర్క్ చేపట్టాలని, అవసరం ఉన్న ప్రాంతంలో కల్వర్ట్ నిర్మాణానికి అంచనాలు వేసి తమకు పంపాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. రిజర్వాయర్‌లో మోటార్లు సరిగా పని చేయకపోవడం వలన పూర్తి స్థాయిలో సరఫరా సాధ్యం కావడం లేదని, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. చెరువు వాకింగ్ ట్రాక్ కొన్ని ప్రాంతాల్లో కుంగి వాకింగ్‌కి ఇబ్బందిగా ఉందని స్థానికుల అభ్యర్థన మేరకు మరమ్మతులు చేపట్టాలని ఏఈని ఆదేశించారు. పర్యటనలో ఎస్ఈ శ్యాం సుందర్, ఈఈ కొండారెడ్డి, డీసీపీ శ్రీనివాస్, ఏసీపీ అజయ్ కుమార్, టీపీఎస్ సువర్ణ కుమార్, ఏఈల రవి కిరణ్ పాల్గొన్నారు.

రిజర్వాయర్లను శుభ్రం చేయాలి

గుంటూరు నగర ప్రజలకు సరఫరా చేసే తాగునీటి రిజర్వాయర్లను నిర్దేశిత గడువు మేరకు శుభ్రం చేయాలని, ప్రస్తుత వర్షాల వలన నీటిని అధిక ప్రాధాన్య క్రమంలో ఫిల్టర్ చేయాలని కార్పొరేషన్ కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. మంగళవారం నాజ్ సెంటర్‌లోని రిజర్వాయర్లను ఈఈ కోటేశ్వరరావుతో కలసి పైకి వెళ్లి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నగరంలోని ప్రతి రిజర్వాయర్ నిర్దేశిత గడువు మేరకు శుభ్రం చేయాలని, శుభ్రం చేసిన తేదీని ప్రత్యేకంగా బోర్డు మీద నోట్ చేయాలన్నారు. ప్రస్తుతం కృష్ణా నదిలో వరద వస్తున్నందున నగర ప్రజలకు అందించే నీటిని మరింతగా ఫిల్టర్ చేయాలన్నారు. తాగునీటి సరఫరా సమయంలోనే ఎమినిటి కార్యదర్శులు క్షేత్ర స్థాయిలో శ్యాంపిల్స్ తీయాలని, ఎక్కడైనా కలుషిత నీటి సరఫరా, పైప్ లైన్ లీకులు గుర్తిస్తే వెంటనే ఇంజినీరింగ్ అధికారుల దృష్టికి తీసుకొచ్చి,పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు.

వర్షం నీరు నిల్వ ఉండకుండా చూడాలి

గుంటూరు నగరంలో వర్షం నీరు ఇళ్లల్లో నిల్వ ఉండకుండా సమగ్ర చర్యలు తీసుకుంటున్నామని, నగర ప్రజలు కూడా డ్రెయిన్లను శుభ్రం చేయడానికి వీలు లేని విధంగా వాటి మీదకు నిర్మాణాలు చేపట్టవద్దని గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం జున్ను షాహిద్ నగర్, బీఆర్ స్టేడియం, శ్రామిక నగర్ ప్రాంతాల్లో డీఈఈ శ్రీధర్‌తో కలసి పర్యటించారు. శ్రామిక నగర్, జున్ను షాహిద్ నగర్, బీఆర్ స్టేడియంలో నిలిచిన నీటిని బెయిల్ అవుట్ చేశామన్నారు. ఆయా ప్రాంతాల్లో భవిష్యత్‌లో వర్షానికి నీరు నిల్వ ఉండకుండా శాశ్వత పరిష్కార చర్యలు తీసుకోవడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని డీఈఈని ఆదేశించారు. ఆక్రమణల తొలగింపు చేపట్టామని, నగర ప్రజలు కూడా సహకరించాలని కోరారు.

విజయవాడకు ఆహార పదార్థాల పంపిణీ



నెహ్రూనగర్: విజయవాడ నగరంలోని ముంపు ప్రభావిత ప్రాంతాల ప్రజలకు గుంటూరు నగరపాలక సంస్థ తరపున అందించే ఆహార పదార్థాలను అత్యంత జాగ్రత్తగా, పరిశుభ్రమైన వాతావరణంలో తయారు చేసి అందించేలా పర్యవేక్షణ అధికారులు శ్రద్ధ చూపాలని గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం నాజ్ సెంటర్‌లోని రిజర్వాయర్ నుంచి విజయవాడకు పంపుతున్న ఒక లక్ష ఆహార, అల్పాహార పదార్థాల ప్యాకెట్స్, వాహనాలను నగర కమిషనర్ దగ్గరుండి పంపించారు. ఆయన మాట్లాడుతూ భారీ వర్షాల వలన విజయవాడలోని అనేక ప్రాంతాల్లో ప్రజలు ముంపునకు గురై ఇబ్బందులు పడుతున్నారని, గుంటూరు నగరపాలక సంస్థ నుంచి మంగళవారం టమాటా బాత్, వెజ్ బిర్యానీ, సాంబార్ అన్నం, పెరుగన్నం, పాలు, బిస్కెట్స్, వాటర్ బాటిల్స్, బ్రెడ్ ప్యాకెట్స్‌ని పూటకి ఒక లక్ష వంతున అందిస్తున్నామని చెప్పారు. ఆహార పదార్థాల తయారీ, సరఫరా చేసే క్యాటరింగ్ ఏజెన్సీలు పరిశుభ్రమైన వాతావరణంలో నాణ్యమైన సరుకులు వినియోగించాలన్నారు. ఆహార పదార్థాలలో నాణ్యత లోపిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట ఈఈ కోటేశ్వరరావు, ఏఈలు సునీల్ కుమార్, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

నేడు, రేపు కూడా వర్షాలు పడే అవకాశం

- కర్ణాటక, తెలంగాణ వర్ష ప్రభావం ఉండే అవకాశం
- ఎటువంటి ప్రాణ నష్టానికి అవకాశం ఇవ్వకూడదు
- నిత్యావసరాలు పంపిణీ వేగవంతం చేయాలి
- జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి



గుంటూరు వెస్ట్: బుధ, గురువారాల్లోనూ జిల్లాలో సుమారు 65 మిల్లీమీటర్ల వర్షాలు కురిసే అవకాశముంది. దీంతో పాటు కర్ణాటక, తెలంగాణల్లో కురుస్తున్న వర్షాల కారణంగా కృష్ణా నదికి వరద నీటి ప్రభావం ఉండొచ్చని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని తన చాంబర్ నుంచి జిల్లా అధికారులతో నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ గత నెల 30, 31 తేదీల్లో కురిసిన వర్షాల కారణంగా కృష్ణా నదికి 11.4 లక్షల క్యూసెక్కులు వచ్చిందన్నారు. ఆ ప్రభావంతోనే లంక గ్రామాలతోపాటు విజయవాడ నగరానికి కూడా వరద ఇబ్బందులు తలెత్తాయని చెప్పారు. వరద ప్రభావిత ప్రాంతాలతోపాటు, లంక, ముంపు ప్రాంతాల్లోని విధులు నిర్వహించే అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రాణహాని లేకుండా పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. వర్షప్రభావిత ప్రాంతాలను చూడడంతో పాటు, సెల్ఫీలు తీసుకునే వారిని కట్టడి చేయాలన్నారు. జిల్లాలో ఇప్పటికే వరదల కారణంగా ఏడుగురు చనిపోయారన్నారు. వరద దెబ్బతిన్న ప్రాంతాల్లో ఎన్యుమరేషన్ పూర్తి చేయాలని చెప్పారు. బాధిత కుటుంబాలకు 25 కిలోల బియ్యం, కేజీ కందిపప్పు, కేజీ చక్కెర, కేజీ పామాయిల్, కూరగాయల కిట్‌ను అందజేయాలని చెప్పారు. నష్ట అంచనా పూర్తి చేసిన వెంటనే కిట్స్ పంపిణీ చేయాలన్నారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం మత్స్యకార కుటుంబాలకు ఒక్కొక్కరికి 50 కేజీల బియ్యాన్ని అందించాలని చెప్పారు. వరదల కారణంగా పశు మరణాలను క్షుణ్ణంగా లెక్కించాలని చెప్పారు. మరణించిన వారికి ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా అందించాల్సి ఉందని చెప్పారు.

ఆరోగ్యం జాగ్రత్త..

కలెక్టర్ మాట్లాడుతూ వర్షాల కారణంగా దోమల బెడద, సీజనల్ వ్యాధులతోపాటు డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వచ్చే ప్రమాదముందని చెప్పారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని కోరారు. తెగిపోయిన విద్యుత్ తీగలతోపాటు అన్ని రకాల మరమ్మతులు నిర్వహించి ప్రజల ఇబ్బందులను తొలగించాలని కోరారు. వరదల వల్ల నష్టపోయిన చేనేత మగ్గాలు, తోపుడు బండ్లు, హ్యాండ్‌లూమ్ తదితర అన్ని అంశాలను ఎన్యుమరేట్ చేసి బాధితులకు న్యాయం చేయాలని కలెక్టర్ వివరించారు. జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ మాట్లాడుతూ ఇప్పటి వరకు 8200 బాధిత కుటుంబాలకు నిత్యావసర వస్తువుల కిట్‌లు అందజేశామన్నారు.

హాస్టల్ వార్డెన్‌పై చర్యలు

గుంటూరు ఎడ్యుకేషన్: నగరంపాలెంలోని స్టాల్ బాలికోన్నత పాఠశాల ప్రాంగణంలోని ఎస్సీ, బీసీ సంక్షేమ వసతి గృహాల వార్డెన్‌పై చర్యలు తీసుకుంటామని పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్లా మాధవి పేర్కొన్నారు. సంబంధిత హాస్టళ్లలోకి గంజాయి తాగుతున్న యువకులు ప్రవేశించి, విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నారనే ఆరోపణలపై ఇటీవల నగరంపాలెం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైన నేపథ్యంలో మంగళవారం ఎమ్మెల్యే హాస్టళ్లను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా జరిగిన ఘటనపై హాస్టల్ వార్డెన్‌తో మాట్లాడారు. రెండేళ్లుగా హాస్టల్‌లో అధ్వాన పరిస్థితులు నెలకొన్నప్పటికీ, వార్డెన్లు ప్రభుత్వం దృష్టికి, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురాకుండా మభ్య పెడుతున్నారని, దీనిపై సమగ్ర విచారణ జరపాలని ఆయా శాఖల అధికారులను కోరారు. హాస్టల్‌లో విద్యార్థినులకు భద్రత కరువైందని, నాణ్యమైన ఆహారాన్ని అందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. హాస్టల్‌లోకి గంజాయి బ్యాచ్ ప్రవేశించి విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించడంపై వార్డెన్‌తో పాటు స్టాల్ గర్ల్స్ హైస్కూల్ కరస్పాండెంట్ బాధ్యులవుతారన్నారు. వార్డెన్ స్వచ్ఛందంగా ఉద్యోగం వదిలి వెళ్లాలని హెచ్చరించారు. ప్రైవేటు స్థలంలో కొనసాగుతున్న హాస్టల్‌కు సరైన రక్షణ లేకపోవడంతో విద్యార్థినులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారని, పరిస్థితులను గాడిలో పెడతామని చెప్పారు.

సమగ్రశిక్షలో పోస్టుల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు జిల్లా సమగ్ర శిక్ష కార్యాలయంలో వివిధ పోస్టుల్లో ఫారిన్ సర్వీసుపై పని చేసేందుకు అర్హత ఉన్న ఉపాధ్యాయులు ఈనెల 9వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్టు సమన్వయకర్త జి.విజయలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి(సీఎంఓ), ఎంఐఎస్ ప్లానింగ్ కో-ఆర్డినేటర్, ఏఎస్ఓ పోస్టుల్లో పని చేసేందుకు జిల్లాలోని ప్రభుత్వ, జెడ్పీ, మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లో పని చేస్తున్న 55 ఏళ్లలోపు వయసు ఉన్న స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులు దరఖాస్తు చేయాలని సూచించారు. సీఎంఓ పోస్టుకు ఎనిమిదేళ్ల సర్వీసుతో పాటు పీజీ, కంప్యూటర్ నైపుణ్యం ఉండాలని తెలిపారు.

ఎంఐఎ ప్లానింగ్ కో-ఆర్డినేటర్ పోస్టుకు ఎనిమిదేళ్ల సర్వీసుతో పాటు మాథ్స్, స్టాటిస్టిక్స్‌లో పీజీ గుర్తింపు పొందిన వర్సిటీలు, సంస్థల నుంచి పీజీడీసీఏ, డీసీఏ అర్హతలు కలిగి ఉండాలని తెలిపారు. ఏఎస్ఓ పోస్టుకు ఐదేళ్ల సర్వీసుతో పాటు మాథ్స్, స్టాటిస్టిక్స్ సబ్జెక్టుల్లో పీజీ, పీజీడీసీఏ, డీసీఏ అర్హత ఉండాలన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను విద్యార్హతలతో పాటు ఇతర అన్ని ధ్రువపత్రాల జిరాక్స్ కాపాలతో డీఈఓ కార్యాలయంలోని సమగ్రశిక్ష విభాగంలో అందజేయాలని, ఇతర వివరాలకు సమగ్రశిక్ష గుంటూరు.బ్లాగ్‌స్పాట్.కామ్ సైట్ సందర్శించాలని సూచించారు.

సింగిల్ నంబర్ ఆడుతున్న ముగ్గురు అరెస్ట్

నగరంపాలెం: సింగిల్ నంబర్ ఆడుతున్న ముగ్గుర్ని పాతగుంటూరు పోలీసులు అరెస్ట్ చేశారు. మంగళవారం మణి హోటల్ కూడలిలో డబ్బులతో సింగిల్ నంబర్ ఆట ఆడుతున్న ముగ్గుర్ని అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలో అదే ప్రాంతానికి చెందిన షేక్ జానీ, షేక్ సలీం, షేక్ జమాల్‌ను అరెస్ట్ చేసినట్లు సీఐ వైవీ సోమయ్య తెలిపారు. ఆ ముగ్గురు నుంచి రూ.1,450, స్లిప్‌లు స్వాధీనం చేసుకున్నామని అన్నారు.

విలువల జోడింపుతోనే రైతుకు ఆదాయం

గుంటూరు రూరల్: రైతులు పండించిన పంటలకు విలువల జోడింపుతోనే రైతులు మంచి ఆదాయం పొందగలరని రైతు నేస్తం ఫౌండేషన్ చైర్మన్ వై.వెంకటేశ్వరరావు తెలిపారు. మంగళవారం వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలో రైతునేస్తం ఫౌండేషన్‌లో రైతులకు సేంద్రియ వ్యవసాయం, సేంద్రియ ఎరువుల తయారీపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులు శ్రమించి పంటలు పండించి, దిగుబడులు సాధించి, ఆ దిగుబడులను మార్కెట్లో విక్రయిస్తున్నారన్నారు. వివిధ రకాల కారణాల వల్ల రైతుల శ్రమకు తగ్గ ఫలితం అందడం లేదన్నారు. కార్యక్రమంలో సేంద్రియ రైతులు శబరీనాథ్, మీసాల రామకృష్ణ మాట్లాడారు. హాజరైన రైతులకు ఒక జామ మొక్కతో పాటు వినాయక మట్టి విగ్రహాన్ని అందజేశారు. శిక్షణకు హాజరైన రైతులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు.

కొనరు.. కొట్టేస్తారు

- ఖరీదైన పట్టుచీరలే లక్ష్యం
- బెంగళూరులో మహిళా దొంగల ముఠా అరెస్టు

బనశంకరి: దుకాణదారుల దృష్టి మళ్లించి లక్షలాది రూపాయలు విలువ చేసే పట్టుచీరలు దోపిడీకి పాల్పడే మహిళా ముఠాని మంగళవారం బెంగళూరు జేపీ నగర పోలీసులు అరెస్ట్ చేశారు. వీరి వద్ద నుంచి రూ.17.50 లక్షల విలువ చేసే 38 పట్టు చీరలను స్వాధీనం చేసుకున్నామని నగర పోలీస్ కమిషనర్ బి.దయానంద్ తెలిపారు. మంగళవారం కేసు వివరాలను ఆయన మీడియాకు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లో కృష్ణా జిల్లా మైలవరం నివాసి పొన్నూరు మల్లి, చెవుటూరువాసి సాదు పట్టి, కొండపల్లి వాసి మేద రజని, గుంటూరు జిల్లా ఉండవల్లి వాసి మదుగాని జానకి ముఠాగా ఏర్పడి చీరల చోరీకి తెరతీశారు. జేపీ నగర పోలీస్‌స్టేషన్ పరిధిలోని సిల్క్‌హౌస్‌లోకి చీరలు కొనాలని వెళ్లారు. అక్కడి సిబ్బంది వారికి పలురకాల పట్టుచీరలు చూపించారు. ఈ సమయంలో వారిలో కొందరు సిబ్బంది దృష్టి మళ్లించి చీరలను దుస్తుల్లో దాచుకునేవారు. ఇలా విలువైన 8 పట్టుచీరలను దొంగిలించారు. ఇటీవల మరోసారి అదే షాపులో 10 పట్టుచీరలను దుస్తుల్లో దాచుకుని వెళ్లిపోతుండగా షాపు యజమాని అడ్డుకుని పరిశీలించగా 10 పట్టుచీరలు బయటపడ్డాయి. వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు వచ్చి చీరలను, మహిళలను పోలీస్‌స్టేషన్‌కి తరలించారు. ముఠాలో మరో ఇద్దరు మహిళలు ఉన్నారని నిందితులు తెలిపారు. చోరీకి పాల్పడిన పట్టుచీరలను కోరమంగలలో నివాసం ఉండే స్నేహితునికి ఇచ్చినట్లు తెలిపారు. అక్కడ సోదాలు చేసి 28 పట్టుచీరలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు, వాటి విలువ రూ.17 లక్షలపైనే ఉంటుందని పోలీసులు తెలిపారు. పరారీలో ఉన్న ఇద్దరు మహిళల కోసం గాలింపు చేపట్టారు. విలేకరుల సమావేశంలో డీసీపీ లోకేశ్ భరమప్ప, ఏసీపీ నారాయణస్వామి, సీఐ రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శ్రీనారాయణదాసు జయంతి ఉత్సవాలు



శ్రీశిష్టి లక్ష్మీకుమార్

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణం శ్రీపద్మావతి కళ్యాణ వేదికపై శ్రీమదజ్జాదాదిభట్ల నారాయణ దాస కథాగాన కళాపరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తోన్న శ్రీ నారాయణదాసు 160వ జయంత్యుత్సవాలు మంగళవారం ముగిశాయి. హరికథలు పట్టు- ఆదిభట్ల అనే అంశంపై శ్రీశిష్టి లక్ష్మీకుమార్ ఉపన్యాసం చేశారు. సంస్థ అధ్యక్షులు కర్రా సూర్యనారాయణ దాసు, తాడేపల్లి సింహాద్రిశాస్త్రి, ఆలయ కమిటీ అధ్యక్షులు సీహెచ్ మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. శ్రీశిష్టి లక్ష్మీకుమార్ మాట్లాడుతూ హరికథా పితామహుడు నారాయణదాసు మైసూరు సంస్థానంలో గానం చేసి, మహారాజా వారి సత్కారం పొందారని అన్నారు. ఒక గురుకులంగా ఆయన వందలాది మంది శిష్యులను తీర్చిదిద్దారని పేర్కొన్నారు. హరికథలోని అంశాలను చక్కటి రాగ భావాలతో, చలోక్తులతో ఆహుతులను తన్మయత్వం పొందేలా చేశారని చెప్పారు. దాసు సంగీత సాహిత్య కళారంగాల్లో మేధావి అని తెలిపారు. కార్యక్రమంలో గంటి సావిత్రిదేవి పాల్గొన్నారు.

ఉచిత ఇసుక రవాణా కోసం నమోదు చేసుకోవాలి



లారీలు, ట్రాక్టర్ల యజమానులతో సమావేశమైన డీటీసీ కరీం, ఇతర అధికారులు

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వం రూపొందించిన ఉచిత ఇసుక కార్యక్రమంలో భాగంగా ఇసుక రవాణా చేసే లారీ యజమానులు మైనింగ్ శాఖ పోర్టల్‌లో విధిగా తమ వివరాలను నమోదు చేసుకోవాలని గుంటూరు ఉప రవాణా కమిషనర్ షేక్ కరీం పేర్కొన్నారు. మంగళవారం జేకేసీ కళాశాలరోడ్డులోని డీటీసీ కార్యాలయంలో రవాణా, మైనింగ్ శాఖలకు ఇసుక రవాణా చేసే లారీ యజమానులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా కరీం మాట్లాడుతూ లారీ యజమానులు ఇసుక రవాణా చేసేందుకు ప్రభుత్వ పోర్టల్‌లో తమ వివరాలతో పాటు వాహన వివరాలను నమోదు చేసుకుని, మైనింగ్ శాఖ డీడీ ద్వారా ఆన్‌లైన్లో అనుమతి పొందాలని, ఆ విధంగా అనుమతి పొందిన వాహనాలనే తాము ఇసుక రవాణాకు అనుమతిస్తామని చెప్పారు. ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ పొందిన లారీలు, ట్రాక్టర్లు ఇసుక సరఫరా చేసేందుకు అనుమతించబడతాయని స్పష్టం చేశారు. ఇసుక సరఫరా చేసే లారీలు, ట్రాక్టర్ల యజమానులు ఈనెల 12వ తేదీలోగా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, ఏవైనా సందేహాలు ఉంటే ఆర్టీఓ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. సమావేశంలో మైనింగ్ శాఖ డెప్యూటీ డైరెక్టర్ చంద్రశేఖర్, ఆర్టీఓ గోపాల్ పాల్గొన్నారు.

దంత వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలి



ఉచిత దంత వైద్యశిబిరాన్ని ప్రారంభించిన అధ్యక్షుడు కాసు వెంకటరెడ్డి

నగరంపాలెం: ప్రతి ఒక్కరూ దంత వైద్య పరీక్షలు చేయించుకుని, ఆరోగ్యంగా ఉండాలని ది గుంటూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాసు వెంకటరెడ్డి అన్నారు. ది గుంటూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కోర్టు ఆవరణలోని బార్ అసోసియేషన్ హాల్‌లో వజ్రమ్స్ మల్టీ స్పెషాలిటీ దంత వైద్యశాల, హోమియో హెల్త్ కేర్ సంయుక్తంగా ఉచిత దంత వైద్య శిబిరం, అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు కాసు వెంకటరెడ్డి శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడుతూ పళ్ల వెంట రక్తం వస్తే దంత వైద్యుల వద్దకెళ్లాలని అన్నారు. దంత వ్యాధులను నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. ఆసుపత్రి కాస్మోటిక్ దంత శస్త్రచికిత్స వైద్యులు ఆర్.శివశైలేష్ మాట్లాడుతూ దంతాలకు గారపట్టిన, చిగుళ్ల నుంచి రక్తం వస్తున్న శుభ్రం చేయవచ్చునని అన్నారు. పళ్లు విరిగిన, బాగాపాడైన వాటిని తీయకుండా రూట్‌కెనాల్ ద్వారా చికిత్స అందిస్తామని చెప్పారు. హోమియో వైద్యులు ఎం.ఉపేంద్రనాథ్ హోమియోపై అవగాహన కల్పించారు. సుమారు 75 మందికిపైగా న్యాయవాదులకు దంత వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. శిబిరంలో బార్ కౌన్సిల్ సభ్యులు వట్టిజొన్నల బ్రహ్మారెడ్డి, అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గౌరీశంకర్, కోశాధికారి కాళిదేవప్రసాద్, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్ దరఖాస్తు గడువు పొడిగింపు

గుంటూరు ఎడ్యుకేషన్: డిసెంబర్ 8న జరగనున్న జాతీయ ప్రతిభా ఉపకార వేతన (ఎన్‌ఎంఎంఎస్) పరీక్షకు దరఖాస్తు గడువు ఈ నెల 17వ తేదీకి పొడిగించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, జెడ్పీ, మున్సిపల్, ఎయిడెడ్, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలల్లో 8వ తరగతి చదువుతూ, కుటుంబ వార్షికాదాయం రూ.3.50 లక్షలలోపు ఉన్న వారు అర్హులని తెలిపారు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ సైట్‌లో ఉంచిన దరఖాస్తును ఆన్‌లైన్‌లో పూరించాలన్నారు.

వరద బాధితులకు భాష్యం చేయూత



ఆహార పదార్థాలను తీసుకెళ్తున్న వాహనం వద్ద భాష్యం ప్రతినిధులు

గుంటూరు ఎడ్యుకేషన్: విజయవాడలో వరద బాధితుల సహాయార్థం భాష్యం విద్యాసంస్థల ఆధ్వర్యంలో మంగళవారం గుంటూరు నుంచి 70 వేల పులిహోర, పెరుగన్నం ప్యాకెట్లను పంపించారు. ఈ మేరకు విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ తెలిపారు. ఇది అత్యంత దయనీయ పరిస్థితి అని, ఇలాంటి కష్ట సమయంలో ప్రతి ఒక్కరూ మానవత్వంతో స్పందించాలని ఆయన పిలుపునిచ్చారు. వరద ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలు పడుతున్న కష్టాలు తన మనసును కలచి వేసినట్లు తెలిపారు. వారిని ఆదుకునేందుకు సామాజిక బాధ్యతగా భాష్యం విద్యాసంస్థల్లో తయారు చేసిన ఆహార పదార్థాలను విజయవాడకు పంపామన్నారు. తమ సిబ్బంది ద్వారా అక్కడ పంపిణీ చేసినట్లు చెప్పారు.

ఖరీఫ్ వరకే పంటలకు ఉచిత బీమా

రబీ నుంచి రైతులపైనే ప్రీమియం భారం

కొరిటెపాడు (గుంటూరు): ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఉచిత పంటల బీమా పథకాన్ని కొనసాగించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. అయితే బీమా కేవలం ఖరీఫ్‌కే పరిమితం చేస్తున్నట్లు పేర్కొంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతు సంక్షేమమే లక్ష్యంగా ఉచిత పంటల బీమా పథకాన్ని ఐదేళ్లు అమలు చేసింది. రైతులపై రూపాయి భారం పడకుండా సుమారు రూ.50 కోట్ల వరకు అందించింది. కూటమి ప్రభుత్వం దీనికి మంగళం పలికేందుకు రంగం సిద్ధం చేసింది. కేవలం ఖరీఫ్ సీజన్‌కే ఉచిత బీమా అమలు చేయనుంది. 2024-25 రబీ సీజన్ నుంచి రైతులు నోటిఫై చేసిన పంటలకు విధిగా బీమా ప్రీమియం చెల్లించాల్సిందే. ఆహార పంటలకు రెండు శాతం, వాణిజ్య పంటలకు 6 శాతం వరకు ప్రీమియం చెల్లించాల్సి ఉంది. ఖరీఫ్ సీజన్‌లో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన, వాతావరణ ఆధారిత బీమా కంపెనీలను కూడా ఎంపిక చేసింది. అయితే రాష్ట్ర ప్రభుత్వం రైతుల వాటా మొత్తాన్ని బీమా కంపెనీలకు ప్రీమియం చెల్లిస్తేనే ప్రకృతి వైపరీత్యాలతో పంటలు నష్టపోయినప్పుడు సొమ్ము రైతులకు అందనుంది.

7న ప్రభుత్వ మద్యం దుకాణాల బంద్



నగరంపాలెం: గుంటూరు నల్లపాడు డిపో పరిధిలోని ప్రభుత్వ మద్యం దుకాణాల్లో విధులు నిర్వర్తించే షాప్ సూపర్‌వైజర్లు(ఎస్ఎస్), షాప్‌సేల్స్‌మేన్ (ఎస్ఎస్ఎం)లు ఈనెల ఏడో తేదీన బంద్‌కు సిద్ధమయ్యారు. ఈ మేరకు ఏపీ స్టేట్ బేవరేజస్ కార్పొరేషన్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం గుంటూరు బ్రాడీపేటలోని నల్లపాడు డిపో డీఎం కె.వెంకట్రామిరెడ్డికి వినతిపత్రం అందించారు. గతనెల 30న ప్రధాన పత్రికల్లో, మీడియాలో అక్టోబర్ ఒకటి నుంచి ఏపీలో పూర్తిగా ప్రైవేటు మద్యం దుకాణాలు అంటూ కథనాలు వచ్చాయని, ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వానికి, సీఎం చంద్రబాబుకు లేఖలు పంపించినట్లు డీఎం దృష్టికి ఎస్ఎస్‌లు తీసుకొచ్చారు. డీఎంను కలిసిన వారిలో ఎస్ఎస్‌లు అనీల్, మోహన్, సూర్య, నరేష్, ప్రవీణ్, సూరిబాబు పాల్గొన్నారు.